పట్టుదల గల ఎమ్మెల్యే గాదరి కిశోర్

తుంగతుర్తిని బ్రహ్మాండంగా తీర్చిదిద్దుతుండు

# తుంగతుర్తిని చూస్తుంటే ఎనలేని తుర్తి

- త్వరలో మిగిలిన ఉన్న ప్రతి ఎకరాకూ సాగునీరు
- లక్ష మెజార్టీతో గెలిపించండి... దళితులందరికీ దళితబంధు
- తుంగతుర్తి సమరశంఖారావం సభలో సీఎం కేసీఆర్

**'ఉద్యమ సమయంలో తుంగతుర్తి గుండా నేను ఏ ఊరికి పోయినా ఏ చెరువులో కూడా చారెడు నీరు కనపడేది కాదు. ఇయ్యాల నేను హెలికాప్టర్‌లో వస్తా ఉంటే మంత్రి జగదీశ్‌రెడ్డి.. నా పక్కనే కూసోని ఇది ఈ ఊరు చెర్వు... అది ఆ వూరి చెర్వు అంటూ చెప్తుంటే... ఏ చెరువు చూసినా ఒక్క వాన పడితే మత్తడి దూకేంత బ్రహ్మాండంగా ఉంది. గతానికి ఇప్పటికి తుంగతుర్తిని చూస్తుంటే ఒక తుర్తి కలుగుతుంది.' అని బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ పూర్తి సంతృప్తిని వ్యక్తం చేశారు. 'ఈ పరిస్థితి అంతటికీ కారణం కాళేశ్వరం ప్రాజెక్టు కట్టుకొని గోదావరి జలాలు పట్టుపట్టి తెచ్చుకోగలిగినం కాబట్టి బ్రహ్మాండంగా ఇక్కడ 1.30లక్షల ఎకరాల వరకు నీళ్లొస్తున్నయ్. అందుకే తుంగతుర్తి జనాల ముఖాలు తెల్లబడ్డాయ్. గతంలో ఉన్న భాద, దుఃఖం ఇప్పుడు కనపడ్త లేదు' అని అన్నారు. దీనంతటికీ కారణం మీ పట్టుదల కలిగిన ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌నే అని కేసీఆర్ అభినందించారు. కరువు బారినపడి వలసల పోయే తుంగతుర్తిని బ్రహ్మాండంగా అభివృద్ధి చేస్తున్నాడని, కిక్కిరిసిపోయేలా ఈ సభకు వచ్చిన జనాలే కిశోర్ పనితనానికి నిదర్శనమన్నారు. కిశోర్‌ను లక్ష మెజార్టీతో గెలిపిస్తే తుంగతుర్తి నియోజకవర్గానికి మొత్తం దళితబంధు ఇస్తానని కేసీఆర్ ప్రకటించడంతో సభా ప్రాంగణం హర్షద్వానాలతో దద్దరిల్లింది. ఆదివారం తిరుమలగిరిలో ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అధ్యక్షతన జరిగిన తుంగతుర్తి సమర శంఖారావం బహిరంగసభ గ్రాండ్ సక్సెస్ అయ్యింది. సీఎం కేసీఆర్‌కు నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు బ్రహ్మరథం పట్టారు. తిరుమలగిరి పట్టణం గులాబీవనాన్ని తలపించింది.**

నల్లగొండ ప్రతినిధి, అక్టోబర్29(నమస్తే తెలంగాణ) : తుంగుతర్తి నియోజకవర్గ సమర శంఖారావ సభ ఆదివారం తిరుమలగిరిలో భారీ జన సందోహంతో సాగింది. బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. తుంగతుర్తి నియోజకవర్గ అభివృద్ధిని ప్రశంసిస్తూ మిగిలి ఉన్న సమస్యలను పరిష్కరిస్తామని చెప్పడంతో ప్రజలు ఈలలు, కేకలతో సభ ప్రాంగణం మార్మోగింది. సీఎం కేసీఆర్ ప్రసంగిస్తూ.. 'ఉద్యమంలో పలు సందర్భాల్లో నేను తుంగతుర్తి ప్రాంతంలో తిరుగుతున్నప్పుడు గోదావరి జలాలు రావాలంటే ఆనాటి కమ్యూనిస్టు యోధుడు బీయన్.రెడ్డి గారికి ఓటేయాలని గోడల మీద నినాదాలు కనబడేవి.. ఈ ప్రాంతం పోరాటాల గడ్డ.. ఎన్ని పోరాటాలు చేసినా.. కొట్లాడినా... ఏ ప్రభుత్వం కూడా కనికరించలేదు.. తుంగతుర్తి నియోజకవర్గం కరువుకు గురైంది. ప్రజలు వలసలు పోయారు' అని గుర్తు చేసుకున్నారు. 'కాళేశ్వరం ద్వారా గోదావరి నీళ్లు తెచ్చుకున్నం. 1.30 లక్షల ఎకరాలకు నీళ్లు పారుతున్నయ్. ఇప్పుడు తుంగతుర్తి నియోజకవర్గంలో ఎండాకాలంలో కూడా చెరువులు మత్తడి దుంకుతున్నయ్' అని చెప్పారు. 'గతంలో ఇక్కడ ఎక్కడా చూసినా స్థూపాలు కనపడేవి... కమ్యూనిస్టు, కాంగ్రెస్ పంచాయితీల వల్ల హత్యలు, కేసులు, గొడవలతో వల్లకాడుగా ఉండేది. అటువంటి తుంగతుర్తి ఈ రోజు బ్రహ్మాండంగా అద్భుతమైన పద్ధతిలో తయారవుతుంది' అని కేసీఆర్ వివరించారు.



తుంగతుర్తి : మండల కేంద్రం నుంచి సభకు తరలివెళ్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

### కిశోర్‌కుమార్ పట్టుదల గల ఎమ్మెల్యే...

'తుంగతుర్తి ఇంతటి అద్భుతాలను సాధించిందంటే.. ఇది సామాన్యమైన ఎమ్మెల్యే చేస్తే అయ్యేది కాదు. చాలా పట్టుదల ఉన్న ఎమ్మెల్యే కిశోర్‌తోనే సాధ్యమైంది. మొదటి నుంచి ఉద్యమంలో నాతో పాటు ఉన్నడు. పోలీసుల దెబ్బలు తిన్నోడు. జైలుకు కూడా పోయినోడు కాబట్టే... పట్టుబట్టి తన తంగ తుర్తిని అభివృద్ధి చేసుకోవాలని ఇవన్నీ తెచ్చాడు' అంటూ సీఎం కేసీఆర్ చెప్పారు. నీళ్లతో పాటు కరెంటు కష్టాలు పోగొట్టేందుకు ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్లు కాలిపోకుండా... రెండు 220కేవీ సబ్ స్టేషన్లతో పాటు 15 సబ్ స్టేషన్లను తీసుకువచ్చాడన్నారు. దంతాలు ఊడిపోయేలా ఉండే దంతాలపల్లి రోడ్డును మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే కిశోర్ పట్టుపట్టి బ్రహ్మాండంగా తీర్చిదిద్దారని వివరించారు. నియోజకవర్గంలోని అనేక తండాలను గ్రామ పంచాయతీలు చేశామని, మిగతా చోట్ల పోడు పట్టాలు కూడా ఇచ్చామని చెప్పారు. తుంగతుర్తిలో వంద పడకల ఆస్పత్రి నిర్మాణం చేసుకుంటున్నామని, రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. మంత్రి జగదీశ్‌రెడ్డి పట్టుబట్టడంతో నల్లగొండ జిల్లాలో రూ.30వేల కోట్లతో దేశంలోనే మొట్టమొదటి అల్ట్రా మెగా పవర్ ప్లాంటును దామరచర్లలో నిర్మిస్తున్నామని, రాబోయే నాలుగైదు నెలల్లో నాలుగు వేల మెగా వాట్ల విద్యుత్తు ఉత్పత్తి కాబోతోందని చెప్పారు. దీంతో కరెంటు కష్టాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు.

### త్వరలోనే మిగిలిన సమస్యలకు పరిష్కారం

తుంగతుర్తిలో మిగిలిన సమస్యలను త్వరలోనే పరిష్కారిస్తామని కేసీఆర్ ప్రకటించారు. 'ఇక్కడ ఇంకొక రెండు మూడు పనులు కావాల్సి ఉంది. దేవాదుల నీళ్లు కూడా తిరుమలగిరి మండలంలోని ఏడెనిమిది ఊర్లకు రావాల్సి ఉంది. పనులు జరుగుతున్నయ్. తప్పకుండా నీళ్లు రప్పిస్తాం. అదే విధంగా బునాదిగాని కాల్వ ద్వారా మోత్కూరు, అడ్డగూడూరు మండలాలకు నీళ్లు రావాల్సి ఉన్నది. ఆ కాల్వను కూడా వెడల్పు చేయడమే కాదూ... కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా భువనగిరి సమీపంలో బస్వాపురం ప్రాజెక్టుతో అనుసంధానం చేసి పుష్కలంగా నీళ్లు ఇస్తం. ఇవి కూడా పూర్తయితే తుంగతుర్తి నియోజకవర్గంలో సుమారు రెండు లక్షల ఎకరాలకు బ్రహ్మాండంగా సాగునీళ్లు పారుతయ్' అని కేసీఆర్ ప్రకటించారు. ఇంతటి కిక్కిరిసిన సభను చూస్తుంటే ఇప్పటికే గాదరి కిశోర్‌కుమార్ భారీ మెజార్టీతో గెలిచిపోయినట్లే అని రుజువు అవుతుంది. అంత ఉత్సాహభరితంగా... ఇంత అద్భుతంగా నన్ను, కిశోర్‌ను ఆశీర్వదించడానికి వచ్చిన మీ అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు' అంటూ కేసీఆర్ తన ప్రసంగాన్ని ముగించారు.

### కిశోర్‌ను లక్ష మెజార్టీతో గెలిపిస్తే.. అందరికీ దళిత బంధు

మీ ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ చేసిన సేవకు, కష్టానికి ఈసారి ఎన్నికల్లో లక్ష ఓట్ల మెజార్టీతో గెలిపించాలని కేసీఆర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సభలో కనిపిస్తున్న ఉత్సాహం, అద్భుతమైన స్పందన చూస్తుంటే లక్ష మెజార్టీతో గెలిచినట్లేనని సభికుల చప్పట్లు, ఈలలు, కేరింతల నడుమ కేసీఆర్ ప్రకటించారు. కులం, మతం, జాతి అనే తేడా లేకుండా కిశోర్‌ను లక్ష మెజార్టీతో గెలిపిస్తే ఈ టర్న్‌లో తుంగతుర్తి నియోజకవర్గంలోని దళితులందరికీ దళితబంధు ఇస్తామని హామీ ఇచ్చారు. దళిత బిడ్డల దరిద్రం పోగొట్టేందుకు తెచ్చిన దళిత బంధు పథకాన్ని తిర్మలగిరి మండలానికి కిశోర్‌కుమార్ పట్టుబట్టి తీసుకువచ్చాడని అన్నారు. 'కిషోర్ బాగా హుషార్ ఉన్నడు. తుంగతుర్తి నియోజకవర్గంలో ఒక మండలానికి దళిత బంధు పెడతా అంటే ఎక్కువ దళితులున్న తిర్మలగిరిని పెట్టించిండు. ఇంటికొచ్చిన సుట్టం పోతా అంటుంటే ఇంత సద్దన్నం ఉంది తినిపో బిడ్డ అంటే... సద్దన్నం తింటా.. వండినంక ఉడుకన్నం కూడా తినిపోతా అన్నట్లుగా కిశోర్ హుషారుతనం చూపిస్తుండ'ని ఓ కథను కూడా కేసీఆర్ ఉదహరించారు. ఇప్పుడిక ఇది చాలా పేదరిక ప్రాంతం.. కాబట్టి తుంగతుర్తి నియోజకవర్గం మొత్తం దళితబంధు పెట్టమని అడుగుతున్నడని కేసీఆర్ వివరించారు.

## కాంగ్రెస్ రక్తం పారిస్తే.. బీఆర్ఎస్ సాగునీరు పారించింది

- పదేండ్లలో వందేండ్ల అభివృద్ధి
- తుంగతుర్తి సమర శంఖారావం సభలో ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

తిరుమలగిరి, అక్టోబర్ 29 : రాష్ట్రం ఏర్పడక ముందు కాంగ్రెస్ పాలనలో తుంగతుర్తి నియోజకవర్గం కక్ష్యలు, కన్నీళ్లతో రగిలిపోయేదని ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. ఆదివారం తిరుమలగిరిలో నిర్వహించిన తుంగతుర్తి సమర శంఖారావ సభలో ఆయన మాట్లడారు. 2014, 2018లో ఉద్యమ రథసారధి, సీఎం కేసీఆర్ తనకు అవకాశం ఇచ్చి ఈ ప్రాంతానికి పంపితే తుంగతుర్తి ప్రజలు ఆశీర్వదించి గెలిపించారన్నారు. 2014కు ముందు కాంగ్రెస్ హయాంలో తుంగతుర్తి గడ్డపై కక్ష్యలు, కొట్లాటలతో రక్తం పారేదని, రాష్ట్రం ఏర్పాటు తరువాత బీఆర్ఎస్ పాలనలో కాళేశ్వరం జలాలు తీసుకొచ్చి సాగు నీరు పారించినట్లు చెప్పారు. నియోజకవర్గంలో లక్ష యాభై వేల ఎకరాలకు కాళేశ్వరం జలాలు అందుతున్నాయంటే అపర భగీరథుడు సీఎం కేసీఆర్ కృషి వల్లే అని తెలిపారు. ముప్పై, నలభై సంవత్సరాల నుంచి నిండని చెరువులు నేడు ఎండకాలంలోనైనా, చలికాలంలోనైనా మత్తడి దుంకుతున్నాయని, అది సీఎం కేసీఆర్ ఘనతేనని చెప్పుకొచ్చారు. తుంగతుర్తిలో వంద పడకల దవాఖాన, రహదారులు, 24 గంటల కరెంట్ ఇలా అనేక కార్యక్రమాలు జరిగుతున్నాయన్నారు. నియోకవర్గంలో 93 వేల మందికి రైతు బంధు, 53 వేల మందికి ఆసర పింఛన్, 11వేల మందికి కల్యాణలక్ష్మి, 8వేల మందికి కేసీఆర్, న్యూట్రిషన్ కిట్లు అందిచండం జరిగిందన్నారు. నియోజకవర్గం అభివృద్ధిలో ఉండాలి అంటే ముచ్చేటగా మూడోసారి కారు గుర్తుపై ఓటు వేసి తనను ఆశీర్వదించాలని కోరారు. సభలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ గుజ్జ దీపికాయుగేందర్‌రావు, ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్మన్ కంచర్ల రామక్రిష్ణారెడ్డి, గౌడ సంఘం కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్, రాష్ట్ర ఉన్నత మండలి మాజీ సభ్యుడు ఒంటెద్దు నర్సింహారెడ్డి, రైతు బంధు సమితి జిల్లా కో ఆర్డినేటర్ ఎస్‌ఏ రజాక్, చెరుకు సుధాకర్, మున్సిపాల్ చైర్మన్ పోతరాజు రజిని, మార్కెట్ కమిటీ చైర్మన్ కొమ్మినేని స్రవంతీసతీశ్, పార్టీ మండలాధ్యక్షుడు సంకేనపల్లి రఘునందన్‌రెడ్డి, ఎంపీపీలు, జడ్పీటీసీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కార్యకర్తలను బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి

### బీఆర్ఎస్‌లో చేరికలు

అర్వపల్లి, అక్టోబర్ 29 : మండలంలోని కొమ్మాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు శనివారం పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో సురారపు గోపాల్, మహేశ్, వీరస్వామి, బౌరోజు సతీశ్, గాడిపల్లి వెంకయ్య ఉన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగాదరి వెంకటమ్మావెంకటయ్య, ఎంపీటీసీ బిక్కునాయక్, ఉప సర్పంచ్ కుంట్ల గోవర్ధన్‌రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు సైదులు, కుంట్ల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

## తుంగతుర్తి గులాబీమయం

తిరుమలగిరి అక్టోబర్ 29 : తిరుమలగిరిలో ఆదివారం జరిగిన తుంగతుర్తి సమర శంఖారావం సభ గ్రాండ్ సక్సెస్ అయ్యింది. నియోజకవర్గం నుంచి పార్టీ శ్రేణులు, ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చారు. అనుకున్నదానికంటే లక్షకు పైగా ప్రజలు వచ్చినట్లు బీఆర్ఎస్ శ్రేణులు చెబుతున్నారు. అన్ని వర్గాల ప్రజలు సంక్షేమ పథకాలు పొందడంతో సభకు స్వచ్ఛందంగా తరలివచ్చారు. సభా ప్రాంగణమంతా జై తెలంగాణ.. జై కేసీఆర్ నినాదాలతో మారుమ్రోగాయి.

### సీఎం కేసీఆర్ సభ సైడ్ లైట్స్

- సాయంత్రం 3.44 గంటలకు సీఎం కేసీఆర్ సభ స్థలానికి చేరుకున్నారు. ఎమ్మెల్యే కిశోర్ సతీమణి కమల కేసీఆర్‌కు వీర తిలకం దిద్ది చేతికి దట్టి కట్టారు.
- రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ సీఎంకు స్వాగతం పలికారు.
- 3.58 గంటలకు సీఎం కేసీఆర్ సభా వేదిక పైకి వచ్చి ప్రజలకు అభివాదం చేశారు.
- 4 నుంచి 4.02 గంటల వరకు ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ ప్రసంగించారు.
- 4.03 నుంచి 4.29 గంటల వరకు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రసంగం కొనసాగింది.
- గాయకులు, కళాకారులు తమ పాటలతో ప్రజలను ఉర్రూతలూగించారు.
- గతంలో దంతాలపల్లి రోడ్డు నుంచి వెళ్తే దంతాలు ఊడిపడేవని, ప్రస్తుతం సువిశాలమైన రోడ్లతో ప్రయాణం ప్రశాంతంగా సాగుతుందని సీఎం కేసీఆర్ చెప్పడంతో చప్పట్లు మారుమ్రోగాయి. 4.35 గంటలకు సీఎం కేసీఆర్ తిరుగు పయణమయ్యారు.